



పార్లమెంట్‌లో సంతకం చేస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

- తెలుగులో కేంద్రమంత్రి ప్రమాణ స్వీకారం

శ్రీకాకుళం, జూన్ 24(ఆంధ్రజ్యోతి): 'కింజరాపు రామ్మోహన్‌నాయుడు అను నేను' అంటూ కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి తెలుగులో ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్‌లో సోమవారం లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ మేరకు శ్రీకాకుళం ఎంపీ, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు.. స్పష్టమైన తెలుగు భాషలో ప్రమాణ స్వీకారం చేశారు. 'కింజరాపు రామ్మోహన్‌నాయుడు అనే నేను.. లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడుతానని, నా బాధ్యతను శ్రద్ధా శక్తులతో అంతఃకరణ శుద్ధితో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నా' అని పేర్కొన్నారు. దీనిపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వసతి గృహాల పరిస్థితి మారేనా?



- మెళియాపుట్టి మండలం పెద్దమడి గురుకుల కళాశాలలో 208 మంది గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.80లక్షలతో కళాశాల భవనాల నిర్మాణం ప్రారంభించారు. 2019 నాటికి భవనాల గచ్చులు, చెక్కసున్నాం పనులు పెండింగ్‌లో ఉండిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పెండింగ్ పనులను పూర్తి చేయకుండా వదిలేసింది. ఈ భవనంలోనే అరకొర సౌకర్యాలతో విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. మరుగుదొడ్లు, డార్మిటరీ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.



- మెళియాపుట్టి మండలం చాపర ఎస్సీ వసతి గృహంలో ప్రస్తుతం 64 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. పిల్లర్లు దెబ్బతినడంతో పాటు గోడ పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ భవనంలోనే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. మరమ్మతులకు గత వైసీపీ ప్రభుత్వం రూపాయి కూడా విదల్చలేదు.

- గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం
- సౌకర్యాలు లేక విద్యార్థుల ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

(మెళియాపుట్టి)

జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాల పరిస్థితి దారుణంగా ఉంది. చాలా హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయి. భవనాల గోడలు బీటలువారి భయంగొల్పుతున్నాయి. శ్లాబ్ పెచ్చులు ఊడిపడుతుండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువులు సాగిస్తున్నారు. గత వైసీపీ సర్కారు వసతి గృహాలను తీవ్ర నిర్లక్ష్యం చేసింది. నాడు-నేడు పేరిట పాఠశాలలకు నిధులు మంజూరు చేసి.. హాస్టళ్లను మాత్రం వదిలేసింది. దీంతో నిధులు లేక అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వసతి గృహాల అభివృద్ధిపై ఆశలు కలుగుతున్నాయి. జిల్లాలో 20 ఎస్సీ వసతి గృహాల్లో 1,312 మంది విద్యార్థులు, 11 పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో 719మంది, ఐటీడీఏ పరిధిలోని గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో 425 మంది, గురుకుల కళాశాలలో 208 మంది, మినీ గురుకులంలో 203 మంది విద్యార్థులు చదువుతున్నారు. అలాగే గిరిజన బాలికలు, బాలురు వసతిగృహాలు 29 ఉండగా ఇందులో 4,278 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరి కోసం ప్రతి ఏటా రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు లెక్కలు చూపిస్తున్నా సౌకర్యాలు మాత్రం కల్పించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రతి ఏడాది వసతి గృహాల్లో పిల్లల సంఖ్య తగ్గుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కాస్మెటిక్ చార్జీలు, దుస్తులు, రగ్గులు, దుప్పట్లు, ట్రంకుపెట్టెలు, మంచాలు ఇచ్చేవారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ సామగ్రిని అందించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. అలాగే, టీడీపీ పాలనలో వేసవి సెలవుల్లో మరమ్మతులకు గురైన వసతి గృహాలను బాగు చేసి విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చేసేవారు. కానీ, వైసీపీ సర్కారు మాత్రం తన ఐదేళ్ల పాలనలో ఇలాంటి పనులు చేపట్టిన సందర్భాలు లేవు. ప్రస్తుతం నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపైనే విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు. నాడు-నేడు పేరుతో మంజూరైన నిధులు, చేసిన పనులపై ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. అధికంగా గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో కొంత మంది వార్డెన్లపై ఆరోపణలు వచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇలాంటి వార్డెన్లను గుర్తించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

- ఈ విషయమై సీతంపేట డీడీ అన్నాదొర వద్ద ప్రస్తావించగా.. 'ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు గుర్తిస్తాం. మౌలికవసతులు కల్పనకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి అందిస్తాం. తక్షణమే కొన్ని పనులు చేపట్టి.. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటా'మని తెలిపారు.

సైకిల్‌పై లోక్‌సభకు కలిశెట్టి అప్పలనాయుడు



కుటుంబ సభ్యులతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, జూన్ 24: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు సంప్రదాయ వస్త్రధారణలో లోక్‌సభకు హాజరయ్యారు. సైకిల్‌పై ఆయన లోక్‌సభకు వెళ్లారు. మొదటిసారిగా పార్లమెంట్‌లో అడుగు పెట్టిన కలిశెట్టి మీడియాతో మాట్లాడుతూ చాలా ఆనందంగా ఉందన్నారు. కేంద్రం సహకారంతో జిల్లాలో పరిష్కారం కావాల్సిన ప్రధాన సమస్యలను పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఇంకా స్వామిభక్తి!



పెద్దపాడు సమీపంలో నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయం

- వైసీపీ కార్యాలయ భవన నిర్మాణం అక్రమమేనని నిర్ధారణ
- నోటీసులు తయారు చేసి.. సంతకం చేశాం.. కానీ
- రేపు నోటీసు తీసుకుంటామని చెబుతున్నారంటున్న ఏసీపీ
- నోటీసు నకలు మీడియాకు ఇచ్చేందుకు కూడా విముఖత

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఏసీపీ.. అలాగే ప్లానింగ్ విభాగం అధికారులు ఇప్పటికీ వైసీపీ నాయకులపై స్వామిభక్తిని చాటుకుంటున్నారు. ప్రభుత్వం మారినా.. ఇన్నాళ్లూ అడ్డగోలుగా వ్యవహరించిన వారి తీరు మాత్రం మారలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీకాకుళంలోని పెద్దపాడు వద్ద మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు ఇంటికి సమీపంలో అనుమతి లేకుండా జిల్లా వైసీపీ కార్యాలయాన్ని నిర్మిస్తున్నారు. ఎకరా యాభై సెంట్ల విస్తీర్ణంలో నిర్మాణం చేపడుతుండగా.. సుమారు 90 శాతం పనులు పూర్తయ్యాయి. కాగా.. ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనాల నిర్మాణదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో ఏసీపీ మాత్రం ఇప్పటికీ నీళ్లు నములుతూ.. పాత అభిమానాన్ని చాటుకుంటున్నారు. ఇంతవరకు భవనం వివరాలపై గోప్యత పాటించిన ఆయన.. సోమవారం మాత్రం కాస్త నోరువిప్పారు. పెద్దపాడు వద్ద నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనానికి అనుమతులు లేవని నిర్ధారించారు. నోటీసుల విషయమై ప్రస్తావించగా.. సిద్ధం చేసి పంపించాం కానీ, రేపు నోటీసులు అందుకుంటామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెబుతున్నారంటూ.. ఇబ్బంది పడుతూ అసలు విషయాన్ని వెల్లడించారు. అక్రమ నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వమే గట్టిగా ఉంటే.. సదరు అధికారికి ఇప్పటికీ మొహమాటం.. ఆపై లోలోన వైసీపీ నాయకులపై అభిమానం వదలడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నోటీసు ఇచ్చేందుకు ఏసీపీ వెనకడుగు వేస్తున్నారని అంతర్గత సమాచారం.

నేడు నోటీసులు జారీ...

సామాన్యుడు ఇంటిపై మరో ఫ్లోర్ నిర్మించుకుంటే వెంటనే వాలిపోయి.. అనుమతులు లేవని.. అడ్డంకులు సృష్టిస్తూ ఇబ్బందులు పెట్టడం టౌన్‌ప్లానింగ్‌లో కీలక అధికారులకు అలవాటుగా మారిపోయింది. కానీ బడాబాబుల విషయంలో మాత్రం స్వామిభక్తిని చూపుతూ.. నిబంధనలకు నీళ్లు వదిలేస్తున్నారు. పెద్దపాడులో అక్రమంగా నిర్మిస్తున్న వైసీపీ కార్యాలయ భవనానికి సంబంధించి జిల్లా వైసీపీ అధ్యక్షుడికి అధికారులు మంగళవారం నోటీసు ఇవ్వనున్నారు. ఇప్పటికే నోటీసు సిద్ధం చేసినా.. నకలు కాపీని విలేకర్లకు ఇచ్చేందుకు ఇంకా విముఖత చూపిస్తున్నారు. ఎంపీ, కేంద్రపౌరవిమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్... తక్షణమే స్పందించి శ్రీకాకుళం కార్పొరేషన్‌లో వైసీపీ వీరవిధేయులుగా ఉన్న అధికారులపై బదిలీ వేటు వేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

పీఏసీఎస్‌ల ప్రక్షాళన



ఇచ్ఛాపురం పీఏసీఎస్ కార్యాలయం



- ప్రత్యేకాధికారుల నియామకానికి చర్యలు
- అధ్యక్షులు, త్రిసభ్య కమిటీల రాజీనామా బాట
- గత ఐదేళ్లూ రైతులకు సక్రమంగా అందని సేవలు
- ఎన్నికలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

(రణస్థలం)

ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్) ప్రక్షాళనకు రంగం సిద్ధం చేస్తోంది. వైసీపీ హయాంలో ప్రతి పీఏసీఎస్‌కు అధ్యక్షుడితో పాటు త్రిసభ్య కమిటీని ప్రకటించింది. ఈ ఐదేళ్లలో పీఏసీఎస్‌లు నిర్వీర్యమయ్యాయి. రైతులకు కనీస సేవలు కరువయ్యాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సహకార సంస్థలకు ప్రత్యేకాధికారులను నియమించాలని భావిస్తోంది. త్వరలో సహకార ఎన్నికలు నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. గత ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో నియమించిన కమిటీలు రాజీనామా చేయాలంటూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. ఈమేరకు సహకారశాఖ అధికారులు మెమోలు జారీచేయగా.. పీఏసీఎస్ అధ్యక్షులతోపాటు కమిటీ సభ్యులు రాజీనామా చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి జిల్లాలో 42 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. గత ఏడేళ్లుగా పీఏసీఎస్ కార్యవర్గాలకు ఎన్నిక జరగలేదు. చివరిసారిగా ఉమ్మడి రాష్ట్రంలో 2013లో ఎన్నికలు జరిగాయి. 2018తో వీరి పదవీకాలం ముగిసింది. కానీ అప్పటికే సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో నాడు చంద్రబాబు సర్కారు పాత కార్యవర్గాలనే కొనసాగించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ మాత్రం త్రిసభ్య కమిటీతో తన పార్టీ ప్రతినిధులను నామినేట్ చేసింది. ఈ ఐదేళ్లూ కనీసం ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచన చేయలేదు. దీంతో పీఏసీఎస్‌లు నిర్వీర్యమయ్యాయి. రైతులకు సేవలందించాల్సింది పోయి వ్యాపార ధోరణిలోకి మారిపోయాయి. పీఏసీఎస్‌ల్లో సంస్కరణల్లో భాగంగా 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ గతంలో జగన్ సర్కారు నిర్ణయం తీసుకుంది. కాగా.. 1964 సంవత్సరం చట్టానికి సైతం సవరణ చేసి తీసుకున్న ఈ నిర్ణయాలు పీఏసీఎస్‌లను నిర్వీర్యం చేసేలా ఉన్నాయంటూ అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై రైతులతో పాటు పీఏసీఎస్ ఉద్యోగులు, సిబ్బంది నుంచి నిరసన వ్యక్తం కావడంతో వైసీపీ ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

రైతులకు దూరమైన 'డీసీసీబీ'

జిల్లాలో సహకార బ్యాంకుగా ఉన్న డీసీసీబీ.. రైతు సేవలకు దూరమైంది. రాజకీయ విభాగంగా, సాధారణ వాణిజ్య బ్యాంకులా మారిపోయింది. కంప్యూటరీకరణతో పాటు వసతులు మెరుగుపడినా రైతులకు ఆశించిన స్థాయిలో లబ్ధి లేదు. అలాగే రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సహకార వ్యవస్థకు నిధుల సర్దుబాటు నిలిచిపోయింది. మరోవైపు విత్తనాలు, ఎరువుల సరఫరా సైతం తగ్గుముఖం పట్టింది. త్వరలో పీఏసీఎస్ ఎన్నికలకు చంద్రబాబు సర్కారు కసరత్తు ప్రారంభించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇకపై తమకు మెరుగైన సేవలు అందుతాయని భావిస్తున్నారు.

ఎక్కువ కేసులు రాజీ చేయాలి

- జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

గుజరాతీపేట, జూన్ 24: ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా పోలీసు అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కోర్టు ఆవరణలో పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ.. చిన్నచిన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి లోక్‌అదాలత్ ద్వారా త్వరగా కేసులు రాజీ చేయాలని కోరారు. అలాగే సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం ఈ నెల 27 నుంచి ఆగస్టు 3వరకు ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేపీ మౌలానా

మళ్లీ దాడి చేస్తాడన్న భయంతో..

- భర్తను కడతేర్చిన భార్య
- గతంలో కొడుకును హత్య చేశాడన్న కారణంతో మనస్పర్థలు
- పోలీసులకు లొంగిపోయిన నిందితురాలు

ఎచ్చెర్ల, జూన్ 24: ఏడాది క్రితం భార్యపై అనుమానంతో కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. ఈ క్రమంలో ఒక కొడుకు ప్రాణాలు కోల్పోయాడు. భార్యతోపాటు మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డారు. అప్పట్లో జైలుకు వెళ్లి.. కొద్దిరోజుల తర్వాత బెయిల్‌పై వచ్చిన అతను.. కుటుంబసభ్యులకు దూరంగానే ఉంటున్నాడు. ఇటీవల గ్రామదేవత పండగ నేపథ్యంలో స్వగ్రామానికి రాగా.. మళ్లీ ఎక్కడ తమపై దాడి చేస్తాడనే భయంతో.. భార్యే అతడ్ని కత్తితో దాడిచేసి చంపేసింది. ఆపై పోలీసులకు లొంగిపోయింది. పోలీసులకు వివరాల మేరకు..



కుప్పయ్య మృతదేహం

కుప్పయ్య (ఫైల్)

- ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామానికి చెందిన కొంద్ర కుప్పయ్య అలియాస్ కుప్పేష్(55) ఆదివారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో ఆయన భార్య హరమ్మ కత్తితో దాడిచేసి హతమార్చింది. గతేడాది జూన్ 27న కుప్పయ్య.. తన భార్య హరమ్మపై అనుమానం పెంచుకుని ఇందుకు సహకరిస్తున్న కుటుంబ సభ్యులపై దాడి చేశాడు. ఈక్రమంలో పెద్ద కుమారుడు తాతారావును చంపేశాడు. ఇదే సంఘటనలో చిన్న కుమారుడు కామరాజు, భార్య హరమ్మ కూడా గాయపడ్డారు. ఈ కేసులో నిందితుడైన కుప్పయ్యను అప్పట్లో పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కొద్దిరోజుల తర్వాత జైలు నుంచి బయటకు వచ్చిన ఆయన శ్రీకాకుళం నగరం బలగ సమీపంలో ఇటుక తయారీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామమైన కుప్పిలిలో గ్రామ దేవత ఉత్సవాలు జరిగాయి. దీంతో సోదరుడు కృష్ణ ఇంటికి కుప్పయ్య వచ్చాడు. తనకున్న రెండు ఇళ్లలో ఏదో ఒక ఇంట్లో ఉండేందుకు కుటుంబ సభ్యులను ఒప్పించాలని కుప్పయ్య గ్రామ పెద్దలకు వద్దకు తిరిగాడు. భర్త ఊరిలోకి వచ్చాడని తెలియడంతో ఎక్కడ ఇంటి మీద దాడిచేస్తాడేమోనన్న భయంతో అతని భార్య హరమ్మ రెండు మూడు రోజులుగా ఆయన ఎక్కడ నిద్రిస్తున్నది వాకబు చేసింది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వేరొకరి ఇంటి మేడపై నిద్రిస్తున్న కుప్పయ్యను కత్తితో చంపేసింది. మెడ భాగంపై కత్తితో దెబ్బ వేయడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయాడు. సోమవారం ఉదయం హరమ్మ ఎచ్చెర్ల పోలీసు స్టేషన్‌కు వెళ్లి.. భర్తనే తానే హత్యచేశానంటూ చెప్పి లొంగిపోయింది. వీఆర్వో టి.రమణమూర్తి ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం సీఐ రామచంద్రరావు, ఎస్ఐ ఎస్.చిరంజీవి ఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీమ్ బృందం కూడా గ్రామాన్ని సందర్శించి వివరాలు సేకరించింది. ఈ మేరకు జేఆర్‌పురం సీఐ రామచంద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వినతులు స్వీకరిస్తున్న జేసీ నవీన్

'మీ కోసం'.. ప్రారంభం

- తొలిరోజు 148 దరఖాస్తుల స్వీకరణ
- అర్జీలకు సత్వర పరిష్కారం: జేసీ నవీన్

కలెక్టరేట్, జూన్ 24: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'మీ కోసం' కార్యక్రమం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రారంభమైంది. గత ప్రభుత్వ హయాంలో 'స్పందన' పేరుతో అర్జీలు స్వీకరించేవారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఏప్రిల్ నుంచి ఈ కార్యక్రమాన్ని నిలిపేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'స్పందన'కు పేరు మార్చుతూ.. 'మీ కోసం' పేరిట ఫిర్యాదుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. రెండు నెలల అనంతరం సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా.. జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారులు వెల్లువెత్తారు. జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహనరావు ఫిర్యాదుదారుల నుంచి 148 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో అలసత్వానికి తావు లేదని స్పష్టం చేశారు. త్వరితగతిన స్పందించి, ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

○ **చివరి తేదీ:** జూలై 9

○ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర ఆవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yknNzixలో చదవండి.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదే విధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్టకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ట కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్టులో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివీల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల



క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్‌ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జూలై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2czlCy9 లో చదవండి.

శివారు ప్రాంతాలకు సాగునీరందిండమే లక్ష్యం

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

నందిగాం, జూన్ 24: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శివారు ప్రాంతాలకు సాగునీరందించడమే ప్రధాన లక్ష్యమని, ఈ దిశలో యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతున్నామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ అన్నారు. సోమ వారం మండలంలోని సుభద్రాపురం నుంచి కణితివూరు వరకు వంశధార ప్రధాన ఎడమ కాలువను వంశధార ఎస్‌ఈ రాంబాబు, పలాస ఆర్డీవో భరత్‌నాయక్, టెక్కలి వంశధార ఈఈ బి.శేఖరరావు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఆరా తీశారు. జూలై మొదటి వారానికి పనులు పూర్తయ్యేలా యంత్రాలతో చేపడుతున్నామన్నారు. రైతాంగానికి నిర్దేశించిన సమ యానికి పనులు పూర్తి చేసి నీరందించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్ల కాలువల మరమ్మతుల కోసం పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా వాటిని ఉపాధి హామీ పథకం ద్వారా వేతనదారులతో చేసేలా ఏపీవోకు సూచించాలని ఎంపీడీవో టి.రాజారావును ఆదేశించారు. సుభద్రాపురం ఎత్తిపోతల పథకంలో దొంగలు పడి ట్రాన్స్ ఫార్మర్‌లోని రాగి, ఆయిల్‌ను దొంగలించారని, దీంతో రైతులకు సంబంధించిన పంట పొలాలకు నీరు అందే పరిస్థితి లేనందున సకాలంలో మర మ్మతులు చేపట్టి రైతులకు ప్రయోజనం చేకూర్చేలా చొరవ చూపాలని సర్పంచ్‌లు బి.సన్యాసిరావు, బి.సోమేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు కె.తాతయ్య, జె.మోహన రావు, రైతులు కోరారు. కణితివూరు సమీపంలోని వంశధార కాలువతో పాటు శిథిలావస్థలో ఉన్న వంతెనను పరిశీలించి అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. కార్యక్రమంలో వంశధార ప్రాజెక్ట్ మాజీ చైర్మన్ మళ్ల బాలకృష్ణ, పలువురు అధికారులు నాయకులు జీరు నానీరెడ్డి, ఎం.సింహాచలం పాల్గొన్నారు.


కణితివూరు వద్ద కాలువను, దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

త్వరితగతిన నీటిని అందించండి: ఎమ్మెల్యే శిరీష

పలాసరూరల్: ఈ ఏడాది పలాస నియోజకవర్గానికి వంశధార కాలువ ద్వారా సాగునీటిని అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కలెక్టర్ మంజిల్ జిలానీని కోరారు. పలాస మండలం టెక్కలిపట్నం వంశధార కాలువను కలెక్టర్ సోమవారం పరిశీలించారు. వంశధార కాలువ దుస్థితిని ఆమె కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలువలో పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారని, పనుల అనంతరం నీరు వచ్చేలా చర్యలు చేపడతామని కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆఫ్‌షోర్ ప్రాజెక్టు వద్దకు చేరుకొని పనుల పురోగతిపై కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన పనులు జరిగేలా చేసి రైతులకు సాగునీరు, పలాస మున్సిపాలిటీకి తాగునీరు అందించేలా చూడాలని ఎమ్మెల్యే శిరీష కలెక్టర్‌ని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్, షణ్ముఖరావు, దువ్వాడ సంతోష్‌కుమార్, వంశధార అధికారులు పాల్గొన్నారు.

వంశధార కాలువను పరిశీలించిన ఎస్‌ఈ

నందిగాం: గొల్లూరు సమీప వంశధార కాలువను వంశధార ఎస్‌ఈ రాంబాబు సోమవారం పరిశీ లించారు. పలాస ఆర్డీవో భరత్‌నాయక్, ఇతర అధికారులతో అక్కడ తొలగించిన వంతెన శిథిలాలను పరిశీలించారు. ఈ సందర్భం గా కాలువకు రక్షణగోడ నిర్మించాలని మళ్ళ బాలకృష్ణ ఎస్‌ఈ దృష్టికి తీసుకువెళ్లారు. సర్పంచ్ ప్రతినిధి జీరు నానీరెడ్డి, మాజీ సర్పంచ్ ముదిలి సింహాచలం కాలిబాట వంతెనపై నుంచి నీరు వచ్చే సమయంలో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.

జలుమూరు/నరసన్నపేట: ఖరీఫ్ సీజన్‌లో వంశధార కాలువల ద్వారా సాగునీరందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వంశధార ఎస్‌ఈ బి.రాంబాబు తెలిపారు. టెక్కలిపాడు, మాకివలస వద్ద గల 11ఆర్ కిల్లాం కాలువలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలువ గట్లను పటిష్టం చేయడంతో పాటు పూడికలను తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమలోఓ వంశధార ఈఈ పీఎస్‌ప్రసాద్, డీఈ శ్రీహరి, జేఈలు సురేష్‌కుమార్, శ్యాం, టీడీపీ నాయకుడు పిరియా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


నందిగాం: గొల్లూరు వద్ద కాలువను పరిశీలిస్తున్న వంశధార ఎస్‌ఈ రాంబాబు

బ్యారేజీ వద్ద ప్రమాదకరం


గొట్టాబ్యారేజి వద్ద రోడ్డుపై ఏర్పడిన పెద్ద గోతులు

హిరమండలం: హిరమండలం గొట్టాబ్యారేజీపైన కంట్రోల్ రూం ఎదురుగా రోడ్డు ప్రమాదకరంగా మారింది. రోడ్డుపై పెద్ద గోతులు ఏర్పడి ఏమాత్రం వర్షం కురిసినా రోజుల తరబడి నీరు చేరి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడ గొయ్యి ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో తెలియక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

కేబినెట్ నిర్ణయాలను హర్షిస్తూ ప్రత్యేక పూజలు

టెక్కలి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం మంత్రి మండలి తీసుకున్న నిర్ణయాలను హర్షిస్తూ టీడీపీ నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక పట్టుమహా దేవి కోనేరు గట్టుపై ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సామాజిక పింఛన్ల మొత్తం పెంపు, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మెగా డీఎస్సీ ప్రకటనతో పాటు గడచిన ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నేతలు దల్లి ప్రసాద్‌రెడ్డి, మట్ట పురుషోత్తం, దుర్గ, అర్చకులు తర్లా శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు

గుణాత్మక విద్యను అందించాలి

జలుమూరు: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన గుణాత్మకమైన విద్యను అందించాలని సమగ్ర శిక్ష ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ అన్నారు. జలుమూరు కేజీబీవీతో పాటు కరవంజ ఆదర్శపాఠశాలలను సోమవారం తనిఖీ చేశారు. సీబీఎస్‌ఈ సిలబస్ అమలు, తరగతుల బోధనను పరిశీలించారు. విద్యార్థులో విద్యా స్థాయిని పెంచేందుకు సీఆర్టీలు, పీజీటీలు కృషిచేయాలన్నారు. అలాగే ఉపాధ్యాయుల విద్యా బోధన సరళిని ప్రత్యేకాధికారి ఎప్పటికప్పుడు పరిశీలించి తగు సలహాలు సూచనలివ్వాలన్నారు. జలుమూరు కేజీబీవీలో మధ్యాహ్న భోజనం వంటలను పరిశీలించి మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఆయనతో పాటు కేజీబీవీ ప్రత్యేకాధికారి ఎ.యశోద తదితరులు పాల్గొన్నారు.


విద్యా సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఏఎంవో

తిర్లంగిలో మేకలపై విషప్రయోగం

టెక్కలి: తిర్లంగి గ్రామంలో గుడ్ల అప్పన్నకు చెందిన ఐదు మేకలు మృత్యువాతపడ్డాయి. అప్పన్నకు చెందిన 36 మేక పిల్లలపై విష ప్రయోగం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తూ టెక్కలి పోలీసు లకు సోమవారం ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న జిల్లా యాదవ సాధికారత కన్వీనర్ ఇప్పిలి జగదీశ్వరరావు, ఆవల శ్రీరాములు అక్కడకు వెళ్లి అప్పన్నను పరామర్శించారు. అయితే మిగిలిన మేకల కు సంబంధిత వెటర్నరీ అసిస్టెంట్ వైద్యసేవలు చేయడంతో కొన్ని తేరుకున్నట్లు తెలిసింది. అప్పన్న ఫిర్యాదు మేరకు రక్తనమూనాలు సేకరించి పరీక్షా కేంద్రానికి పంపించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ విషయమై దర్యాప్తు చేసి నష్టపోయిన బాధితుడికి న్యాయం చేయాలని మాజీసర్పంచ్ ధవళ రామచంద్రరావు కోరారు.

మంత్రి అచ్చెన్నను కలిసిన పశువైద్య నిరుద్యోగ పట్టభద్రులు

టెక్కలి: రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సోమవారం పశువైద్య నిరుద్యోగ పట్టభద్రులు సోమవారం విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. దుశ్శా లువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. 2018లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పశువైద్య పట్టభద్రుల నియామకం జరిగిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్క పశువైద్య నియామకం కూడా చేపట్టలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. రాష్ట్రంలో ఉన్న 1,217 ఆర్‌ఎల్‌యూలను పశువైద్యశాలలుగా మార్చి పశువైద్యుల నియామకం చేప ట్టాలని కోరారు.


మంత్రిని అభినందిస్తున్న పశువైద్య పట్టభద్రులు

మట్టి నమూనాల సేకరణ

హిరమండలం: భూమిలో మొక్కకు అవసరమైన ధాతులోపాన్ని గుర్తించేందుకు మట్టి నమూనాలు ఎంతో కీలకమని వ్యవసాయాధికారి సంధ్య తెలిపారు. సోమవారం కల్లట పంచాయతీలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టి నమూనాల సేకరణ ద్వారా భూసారాన్ని తెలుసుకోవచ్చున్నారు. మండలంలో 377 శాంపిళ్లు సేకరిస్తున్నామన్నారు. 20 రోజుల్లో మట్టి పరీక్షల ఫలితాలు రైతులకు అందజేస్తామన్నారు.

గ్రామాలను ఆరోగ్యంగా ఉంచాలి

మెళియాపుట్టి: పారిశుధ్య నిర్వహణ ద్వారా గ్రామాలను ఆరోగ్యకరంగా ఉంచాలని ఎంపీడీవో జి.భాస్కరరావు తెలిపారు. సోమవారం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యశాఖ సిబ్బందితో సమీక్ష సమా వేశం నిర్వహించారు. రానున్నది వర్షాకాలం కాబట్టి అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్య కార్యక్రమాలపై అవగాహన కలిగించాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణ్, ఈవోపీఆర్డీ తార ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నేడు వరసిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

నందిగాం: నందిగాం గణేష్ కాలనీలోని వరసిద్ధి వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామపురోహితులు రేజేటి బోసుబాబు, రమేష్ శర్మ పర్యవేక్షణలో విశేష పూజా కార్యక్రమాలు, హోమాలు, సాయంత్రం కోలాటంతో ఊరేగింపు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పాతపట్నం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.రామకృష్ణరాజు ఒక ప్రకటనలో తెలి పారు. ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు, ఆహ్వానితులు హాజరుకావాలని కోరారు.

మేకపిల్లల మృతితో నష్టపోయాం.. ఆదుకోండి

పాతపట్నం: మేక పిల్లల మృతితో తీవ్రంగా నష్టపోయానని ఆదుకోవాలని కొరసవాడ గ్రామానికి చెందిన పైసక్క శిమ్మయ్య కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రం అందించారు. ఈనెల 22న వీధి కుక్కల దాడికి గురై ఒకేసారి 20 మేక పిల్లలు మృత్యువాత పడ్డాయన్నారు. ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చర్యలు ఉన్నతాధికారులకు విన్నవిస్తామని అధికారులు భరోసా ఇచ్చారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

పాతపట్నం: అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కె.రామకృష్ణ రాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం గంగువాడ, బైదలాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలన్నారు. మురుగు కాలువల్లో పూడికలు తీయాలని, మురుగునీరు నిలువ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఇంజనీరింగ్ సహాయకులు ప్రతి రోజూ రెండు శ్యాంపిళ్లను సేకరించి పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కల్యాణరాం, ఈవోపీఆర్డీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై ప్రజలకు అవగాహన

సంతలక్ష్మిపురం(పోలాకి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రబలుతున్న అంటువ్యాధులపై ముఖ్యంగా డెంగ్యూపై పోలాకి పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం సంతలక్ష్మీపురం, గొల్లలవలస, దీర్ఘాశి గ్రామాల్లో అవగాహన కలిగించారు. డా.బంటుపల్లి ద్రాక్షాయని, నక్క లక్ష్మి, సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం, విరేచనాలు, తలనొప్పి, అతిసారం సోకిన వెంటనే ఆశా కార్యకర్త ద్వారా సమీపంలోని ఆసుపత్రిలో చికిత్స పొందాలని కోరారు. అలాగే గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను తెలిపారు. కార్యక్రమంలో 104 వాహన ప్రతినిధులు సుమతి, రమా, పద్మ, రామకృష్ణ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

వజ్రపుకొత్తూరు: పల్లిసారధి జనచైతన్య ఆర్ట్స్ యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని సోమ వారం ఎన్నుకున్నట్లు మాజీ సర్పంచ్ పోతనపల్లి ధర్మారావు తెలిపారు. అధ్యక్షుడిగా ఉప్పరపల్లి వాసు, ఉపాధ్యక్షుడిగా రెయ్యి కల్యాణ్, సెక్రటరీగా భైనపల్లి సింహాద్రి వర్మ, కోశాధికారిగా దుమ్ము విజయ్, ఆర్గనైజర్‌గా వనమాలి గణపతిలను ఎన్నుకున్నామన్నారు. అలాగే కళా, క్రీడా, విద్యారంగాల కమిటీలు ఎన్నుకున్నట్లు ధర్మారావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యవర్గాలను సర్పంచ్ బత్తిని హేమంత్, గ్రామస్థులు అభినందించారు.

7, 8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి పరీక్ష

ఈదులవలస(పోలాకి): ఈదులవలస ఆదర్శ పాఠశాలలో ఏడు, ఎనిమిది తరగతుల్లో మిగుల సీట్ల భర్తీకి సోమవారం ప్రతిభ పరీక్ష నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఏడో తరగతికి 40 మంది, ఎనిమిదో తరగతికి 29 మంది హాజరయ్యారు. పరీక్షల్లో అధిక మార్కులు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని, ప్రవేశానికి నిజ ధ్రువీకరణ పత్రా లతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9949345179 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

'చేయూత' మొత్తం జమకాలేదని ఫిర్యాదు

పోలాకి: చేయూత పథకం ద్వారా గత ప్రభుత్వం చివరివిడతగా విడుదల చేసిన నగదు తమ ఖాతాల్లో పడలేదని పలువురు బాధితులు సోమవారం ఎంపీడీవోకి ఫిర్యాదు చేశారు. రూ18,750 ఖాతాలో జమ కాలేదని పోతల రమణమ్మ, కింజరాపు కళావతి, అల్లాడ శాంతమ్మ, గేదెల శకుంతల, పాలిన లక్ష్మి, నల్లబాటి సుగుణ, మెండ ఈశ్వరమ్మ, పొందరి సరోజిని, తదితరులు ఫిర్యాదు చేయగా పరిశీలిస్తామని ఎంపీడీవో ఉషశ్రీ భరోసా ఇచ్చారు. సచివాలయాలకు వెళ్లి వాకబు చేసినా మాకు తెలియదంటూ సిబ్బంది చెబుతున్నారని, తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు కోరారు.

'నీట్' పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ చేయించాలి

టెక్కలి: దేశవ్యాప్తంగా మే 4న జరిగిన వైద్య విద్య ప్రవేశ పరీక్ష (నీట్) రద్దు చేసి లీకేజీపై సమగ్ర విచారణ చేయించి దోషులను శిక్షించాలని రాష్ట్ర నిరుద్యోగ పోరాటసమితి ప్రతినిధి టి.సూర్యం కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్‌కు వినతిపత్రం అందించారు. అంతకుముందు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరుద్యోగ పోరాటసమితి ప్రతినిధులు, నిరుద్యోగులు నినాదాలు చేశారు. నీట్ పరీక్ష తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. వీరితో పాటు జనసేన నాయకులు కూరాకుల యాదవ్ ఉన్నారు. అలాగే జైభారత్ నేషనల్ పార్టీకి చెందిన ప్రతినిధి బైపల్లి పరమేశ్వరరావు నీట్‌పై దర్యాప్తు చేయాలని కోరారు.

సమస్యలపై వినతులు

కొత్తూరు: నేరడిలో లోఓల్టేజీ కారణంగా గ్రామంలో ఎలక్ట్రానిక్ సామగ్రి పాడైపోతున్నాయని, సమస్య పరిష్కరించాలని వైస్ ఎంపీపీ తులసీవర ప్రసాద్ కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వినతులు వచ్చాయి. కుంటిభద్ర జడ్డోడు చెరువులో పూడికలు తొలగించాలని కోరారు. హడ్డుబంగి గెడ్డలో పూడిక తీసివేయాలని ఉదయ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. కౌసల్యాపురానికి చెందిన విశాలమ్మ పంచాయతీ భవనం మంజూరు కోసం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమరావు, తహశీసీల్దార్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

జీవో 117ను రద్దుచేయాలి

జలుమూరు: ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసిన జీవో నెం.117 రద్దుచేసి ప్రాథమిక విద్యను కాపాడాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోరాడ వైకుంఠరావు డిమాండ్ చేశారు. చల్లవానిపేట ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలలకు పంపించాలన్నారు. అమ్మకు వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే అమలు చేయడం ద్వారా పాఠశాలలు బలోపేతమవుతాయన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎన్.హర్షవర్ధన్, ఎన్.పురుషోత్తమరావు, జి.రాము తదితరులు పాల్గొన్నారు.

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలి

జలుమూరు: బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి సమీపంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వమించారు. ఐదేళ్ల నుంచి 14 సంవత్సరాలు వయసు గల పిల్లలు బడి బయట ఉండేందుకు వీలులేదన్నారు. సమావేశంలో ఎంఈవోలు బి.మాధవరావు, ప్రసాదరావు, సీఆర్పీలు పాల్గొన్నారు.

తెలుగునాడు రాష్ట్ర కమిటీలో 'నల్లి'కి చోటు

పోలాకి: రాష్ట్ర తెలుగునాడు వైద్య ఉద్యోగుల కమిటీలో పోలాకి ఆరోగ్యకేంద్ర విస్తరణాధికారి నల్లి రవికుమార్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడంపై పోలాకి, గుప్పెడుపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీనాథ్, సుప్రియా, చందన్, రతన్‌రాజు హర్షం వ్యక్తంచేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రవికుమార్ పరిష్కరిస్తారని సిబ్బంది అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అయనను అభినందించారు.

ప్రభుత్వ భూముల వివరాలు అందించండి

● రెవెన్యూ అధికారులను కోరిన ఎమ్మెల్యే శిరీష

పలాస, జూన్ 24: పలాస నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయో ఆ వివరాలు అందించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం సమావేశ మందిరంలో నియోజకవర్గస్థాయి రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాశీబుగ్గ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్వాసితులకు ఇప్పటి వరకు ఎంత మందికి నష్టపరిహారం చెల్లించారు, వారికి కేటాయించిన భూముల్లో పట్టాలిచ్చారా అని ప్రశ్నించారు. దీనికి సంబంధించి వివరాలను తక్షణం అందించాలన్నారు. రేషన్‌కార్డుల పంపిణీ పెండింగ్ వివరాలు, గత ఐదేళ్లలో అన్యాక్రాంతానికి గురైన ప్రభుత్వ భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 2014- 19లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాల్సిన పెట్రోల్ బంకు ఎందుకు ఆగిపోయిందని ప్రశ్నించారు. ఆర్డీవో భరత్‌నాయక్ మాట్లాడుతూ.. వివరాలన్నీ సేకరించి అందిస్తామన్నారు. కార్యక్ర మంలో తహసీల్దార్లు, ఆర్ఐలు, సీఎస్‌డీటీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గౌతు శిరీష, పక్కన ఆర్డీవో

పక్షపాతం లేకుండా విధులు నిర్వహించాలి

మందస: మండలంలో అధికారులు తమ బాధ్యతలను పక్షపాత వైఖరి లేకుండా సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించే కార్యక్రమంలో పాల్గొన్నారు. గత ప్రభుత్వ పాలన వలే కాకుండా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి సంక్షేమం అందించడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తామని, దీనికి అధికారులు సహకరించాలన్నారు. తప్పుడు సర్టిఫికేట్లతో అర్హత లేకుండా పథకాలు పొందుతున్న వారి వివరాలు తెలియజేస్తే వాటిని తీసి వేయడం జరుగుతుందన్నారు. మందస మండలంలో భూ కబ్జాలపై ఫిర్యాదులు వస్తున్నాయని, సాక్ష్యాలతో సహా నిరూపించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో రఘుపతిరావు పాల్గొన్నారు.

● మందస మండలంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆదివాసీ వికాస్ పరిషత్ మండల అధ్యక్షుడు సవర జగన్నాయకులు ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందించారు. చీపి నుంచి బుడంబో వరకు తారురోడ్డు, వంతెనల నిర్మాణం పూర్తి చేయాలని, గిరిజన భూములకు పట్టాలు అందించాలని, పట్టులోగాం గిరిజన ఆశ్రమ పాఠశాలకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ● మండలంలోని రైతు సమస్యలను పరిష్కరించాలని మహేంద్ర రైతు సంఘం నాయకులు సోమవారం తహసీ ల్దార్ ఎస్.తిరుమలబాబుకు వినతిపత్రం అందజేశారు. ఎరువులు, క్రిమిసంహారక మందులు రాయితీపై అందించాలన్నారు.

మత్స్యకార సమస్యలు పరిష్కరిస్తా

వజ్రపుకొత్తూరు: మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన ఆమెను పలువురు మత్స్యకారులు కలిసి అభినందించారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సూరాడ మోహనరావు, జోగి తిరుపతి, కంబా దానేష్, కోడ రామన్న, గోవిందు పాపారావు, దుర్గారావు ఉన్నారు.

రట్టి గెడ్డ, బహాడపల్లి రోడ్డుకు మోక్షం

హరిపురం/వజ్రపుకొత్తూరు: ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న రట్టి రోడ్డులోని రాకాసి గెడపై వంతెనకు, బహాడపల్లి-డెప్పూరు రోడ్డుకు మోక్షం లభించినట్లు ఎమ్మెల్యే గౌతు శిరీష ఒక ప్రకట నలో తెలిపారు. రట్టి గెడ్డ వంతెనకు రూ.1.51 కోట్లు, బహాడ పల్లి-డెప్పూరు (వజ్రపుకొత్తూరు మండలం) రోడ్డుకు రూ.5.65 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. త్వరలో టెండర్లు పిలిచి వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాలువపై మేకల కబేళా ఎత్తివేయాలి

పలాస: స్థానిక చేపల మార్కెట్ వద్ద కాలువపై మేకల కబేళా నిర్వహిస్తున్నారని, దీంతో కాలువ పూడుకుపోతోందని, తగు చర్యలు తీసుకోవాలని 13వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి కె.సత్యం కోరారు. ఈ మేరకు కమిషనర్ టి. రాజగోపాలరావు, చైర్మన్ బళ్ల గిరిబాబుకు సోమవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేశారు. కబేళాకు ప్రత్యేక స్థలం ఉన్నా ఇంటి వద్దే మేకలను వధిస్తున్నారని, దీనికితోడు కాలువ ఆక్రమించి వాటిపైనే నిర్వహిస్తుండడంతో పారిశుధ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారన్నారు. అలాగే వార్డులో కాలువల్లో పూడికలు ఎక్కువగా ఉన్నాయని, తొలగించాలని కోరారు. ఎ.రామకృష్ణ, గోళ్ల చంద్రరావు ఉన్నారు.

సెంటర్ లైటింగ్‌కు మోక్షం

టెక్కలి: టెక్కలి పాత జాతీయరహదారి జగతిమెట్ట జంక్షన్ నుంచి టెక్కలి గ్రామం శివారు వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల సెంటర్ లైటింగ్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ లైటింగ్‌పై వైసీపీ హయాంలో నిర్లక్ష్యం వహించారు. అచ్చెన్నాయుడు మంత్రి అయిన తక్షణం అధికారులకు ఆదేశా లివ్వడంతో రూ.20లక్షలు వెచ్చించి సెంటర్ డివైడర్ లైటింగ్ మరమ్మతులు చేయించి సోమవారం వెలిగించారు. సెంటర్ లైటింగ్ వెలగడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



డీజీపురం విద్యార్థులకు అభినందన

సంతబొమ్మాళి: ఎస్ఈఎంఎస్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన డీజీపురం జడ్పీ హైస్కూల్ విద్యార్థులను డీఈవో కె.వెంకటేశ్వరరావు అభినందించారు. సోమవారం శ్రీకాకుళంలో జరిగిన కార్యక్రమంలో ఎ.కీర్తన, ఐ.దీపిక బి.కామేశ్వరరావు, బి.ఆకాంక్ష, ఎస్.కీర్తన, డి.నవ మనోజ్ఞతకు జ్ఞాపిక అందించి అభినందించారు. హెచ్‌ఎం కోత చైతన్య, ఉపాధ్యాయుడు భాస్కరరావు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ

పల్లిపేట(పోలాకి): పల్లిపేట గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ఆబోతు లక్ష్మణరావు ఇటీవల విధి నిర్వహణలో గుండెపోటుకు గురై మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను టీడీపీ నేతలు సోమవారం పరామర్శించారు. సీఎంగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం రోజున విజయవాడలో విధి నిర్వహణలో ఉండగా గుండె పోటు గురై లక్ష్మణరావు మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన ఇంటికి టీడీపీ మండల అధ్యక్షుడు ఎంవీ అప్పలనాయుడు, లుకలాపు రాంబాబు తదితరులు వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో తార రామకృష్ణ, యోగి, మంగరాజు, షైలపల్లి త్రినాథ్ తదితరులున్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మృతి

పాతపట్నం: పాతపట్నం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గ్రేడ్-2గా పనిచేస్తున్న కె.ప్రియంవద(45) అనారోగ్యానికి గురై విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెంది నట్లు కుటుంట సభ్యులు తెలిపారు. ఈమె స్వగ్రామం కోదూరు కాగా భర్త పాలకొండ సోమేశ్వరరావు మెళి యా పుట్టి మండలం బాశిగిట్టంగిలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. కేన్సర్ వ్యాధికి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రైతులందరికీ విత్తనాలందిస్తాం


విత్తనాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వజ్రపుకొత్తూరు: రైతులందరికీ సకాలంలో విత్తనాలు అందిస్తామని గోవిదంపురం పీహెచ్‌సీ మాజీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకుడు పుచ్చ ఈశ్వరరావు అన్నారు. సోమవారం గోవిందపురం ఆర్బీకేలో వ్యవసాయాధికారులు రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈశ్వరరావు మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు పభుత్వ హయాంలో రైతులకు న్యాయం జరుగుతుందన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి, నేతలు కర్ని రమణ, మదనాల జోగారావు, వ్యవసాయాధికారి కుసుమకుమారి, ఉప సర్పంచ్ గుంట సత్యం, సీపాన గోపి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి సారించండి

సంతబొమ్మాళి: గ్రామాల్లో పారిశుధ్య పనులపై సిబ్బంది దృష్టి సారించాలని డీఎల్పీవో ఐవీ రమణ అన్నారు. సోమ వారం నౌపడ వాటర్ పంపుహౌస్‌ను పరిశీలించి క్లోరినేషన్ చేయించారు. ప్రస్తుతం వర్షాలు పడి అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులతో పాటు తాగునీటిని క్లోరినేషన్ చేయించాలన్నారు. అనంతరం ఇజ్జువరం పంచాయతీలోని కాలువలను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ముక్కి రవికుమార్, ఉప్పాడ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

నీరు లేక.. నిర్వహణకు నోచుకోక..

- అధ్వానంగా టాయిలెట్లు
- వెంటాడుతోన్న డ్రైనేజీ సమస్య
- రిమ్స్‌లో చోద్యంచూస్తున్న అధికారులు

(అరసవల్లి)

అది జిల్లాకే పెద్దాసుపత్రి. నిరుపేద, దిగువ మధ్య తరగతి ప్రజలకు రోగాలు వస్తే ఈ ఆసుపత్రే పెద్ద దిక్కు. ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి ఆర్థికస్థోమత లేనివారంతా తమ అనారోగ్యానికి చికిత్స కోసం ఈ ఆసుపత్రినే ఆశ్రయిస్తారు. జిల్లా నలుమూలల నుంచి వందల సంఖ్యలో ప్రతి రోజూ వస్తుంటారు. అటువంటి ఆసుపత్రిలోకి వెళ్తే వచ్చిన రోగం అలాఉంచితే కొత్త రోగాలు రావడం ఖాయమని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిశుభ్రత మచ్చుకైనా కానరాకపోవడంతో వైద్యానికి వచ్చిన వారు ఆందోళన చెందుతున్నారు. శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి (రిమ్స్)కి నిత్యం వందలాది మంది రోగులు, వారి సహచరులు వివిధ వస్తుంటారు. ఇన్‌పేషెంట్లుగావందలాది మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతుంటారు. ఇటువంటి చోట రోగులు,వారి సహచరులు వినియోగించే టాయి లెట్ల పరిస్థితి అధ్వానంగా తయారైంది. అపరిశుభ్రతతో టాయిలెట్లు కంపుకొడుతున్నాయి. ప్రధానంగా టాయిలెట్లకు నీటి సరఫరా సరిగా లేకపోవడంతో పాటు నిర్వహణ లేక ఆసుపత్రి కంపుకొడుతోంది.

అస్తవ్యస్తంగా డ్రైనేజీ

పారిశుధ్య సిబ్బంది సరిపడనంత ఉన్నా ఆసుపత్రిలో పరిశుభ్రత కానరావడం లేదు. పైపు లైన్ల లీకేజీతోపాటు వాడుక నీరు బయటకు పోయేందుకు డ్రైనేజీ వ్యవస్థలేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం కురిస్తే నీరు నిల్వ ఉండిపోతుంది. ఇంజనీరింగ్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం శూన్యం.

పారిశుధ్య సిబ్బంది ఉన్నా అంతే..

ప్రభుత్వసర్వజన ఆసుపత్రి, మెడికల్‌కాలేజీ, విద్యార్థుల హాస్టళ్లకు సరిపడినంత పారిశుధ్య సిబ్బంది ఉన్నాసరే, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలతో ఎవరూ ఏమీ చేయలేని పరిస్థితి. కొత్తగా నిర్మాణంలో ఉన్న భవనాల మెటీరియల్‌ను పని పూర్తయ్యాక కూడా అక్కడ నుంచి తీసివేయకపోవడంతో, చిన్నపాటి వర్షానికే నీరు నిల్వ ఉండిపోయే పరిస్థితి. కాంట్రాక్టర్లపై బాధ్యత ఉన్నా సరే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో పరిస్థితి మరింత జటిలంగా మారుతోంది. ఇప్పటికైనా అధికారులు, నాయకులు ఈ సమస్యపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తాళం వేసేసిన టాయిలెట్ రూమ్ →



జూలై 1 నుంచి ఇంటికే పెంచిన పింఛన్

- 3,19,702 మందికి లబ్ధి
- మంత్రిమండలిలో నిర్ణయం

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: పెంచిన సామాజిక భద్రత పింఛన్లు ఇళ్లకే జూలై ఒకటో తేదీ నుంచి అందజేయాలని మంత్రిమండలి నిర్ణయించింది. పింఛన్‌ను రూ. 3 వేల నుంచి రూ. 4వేలకు పెంచుతామని ఎన్నికలమేనిఫెస్టో టీడీపీ పొందుపరిచింది. దీంతో ఈ హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు పదవి బాధ్యత చేపట్టగానే సంతకం చేసిన విషయం విదితమే. ఈమేరకు సోమవారం మంత్రి మండలి సమావేశంలో పెంచిన పింఛన్‌ను ఇంటికే అందజేసేలా నిర్ణయించారు. ముఖ్యమంత్రి చేసిన సంతకాలన్నింటిపై మంత్రి మండలి ఆమోదించింది. శ్రీకాకుళం జిల్లాలో 984 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మొత్తం 3,19,702 మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉన్నారు. ఇందులో రూ. 3వేలు చొప్పున పింఛన్ అందుకుంటున్న వృద్ధులు 1,71,602 మంది, వితంతువులు 74,652, నేత కార్మికులు 3,524, దివ్యాంగులు 32,135, కల్లుగీత కార్మికులు 1878, ట్రాన్స్‌జెండర్లు 57, మత్స్యకారులు 7,218, ఒంటరి మహిళలు 10,085, డప్పు కళాకారులు 1949, చర్మకారులు 555, కళాకారులు 276 మంది ఉన్నారు. వీరికి ఈఏడాది ఏప్రిల్ నుంచిపెంచిన పెన్షన్ రూ. వెయ్యితో కలిపి జులై ఒకటి న సచివాలయ సిబ్బందితో అందజేయనున్నారు.అలాగే దివ్యాంగులకు రూ. 6వేలు చొప్పున పెన్షన్ అందుతుంది. వీరికి కూడా ఏప్రిల్ నుంచి పెంచిన రూ. 3వేలుతో కలిపిఅందజేస్తారు. మెగాడీఎస్సీలో భాగంగా ఏకంగా 16,347 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదించింది. ఇందులో భాగంగా ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 1500 ఉపాధ్యాయ పోస్టులు భర్తీకానున్నాయి. ఇందుకోసం పదివేల మంది అభ్యర్థులు పరీక్షకు సిద్ధమవుతున్నారు. మూతపడిన అన్నక్యాంటీన్లు తెర చుకోనుండడంతో కార్మికులు, సాధారణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులందరికీ విత్తనాలు

- ఇచ్ఛా పురం ఎమ్మెల్యే బెందాళం అశోక్

కంచిలి: రైతులందరికీ విత్తనాలు అందు బాటులో ఉంటాయని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం మండలంలోని గోకర్ణపురంలో విత్తనాలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏకేఎస్ రవి, ఎంపీడీవో వి.నీరజ, వ్యవసాయశాఖఏడీ జగన్ మ్యోహన్‌రావు, ధనుంజయ, ఏవో బి.నర సింహమూర్తి,నాయకులు రామారావు, బంగారు కురయ్య, దేవదాసురెడ్డి, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు,శోభన్, కాంతారావు పాల్గొన్నారు.



కంచిలి: విత్తనాలు పంపిణీ చేస్తున్న అశోక్

- కంచిలి మండలంలోని డీజీపురం, భైరిపురంల్లో టీడీపీ కూటమి నాయకుల ఆధ్వర్యంలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు బంగారు కురయ్య, మాదిన రామారావు, పూర్ణ, పురుషోత్తం రెడ్డి, ప్రదీప్, చినబాబు, రమేష్ రెడ్డి, రమేష్ మహంతి పాల్గొన్నారు.
- **జి.సిగడాం:** వాండ్రంగి, బాతువ, పాలఖండ్యాం తదితర గ్రామాల్లో వరి విత్తనాలను పంపిణీ చేశారు. కార్య క్రమంలో మాజీ సర్పంచ్ బూరాడ వెంకటరమణ, సర్పంచ్‌లు సాకేటి నాగరాజు, డి.రెయమ్మ, నాయకులు కూను బిల్లి కూర్మారావు, పలిశెట్టి సూర్యనారాయణ, బొట్ట భాస్కరరావు, వీఏఏలు ముంతా హేమంత్, పొగిరి నారాయణరావు పాల్గొన్నారు.

లావేరు: లావేరు-2 సచివాలయం పరిధిలో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనపకుర్తి తోటయ్యదొర, కూటమినాయకులు నిడిగంట్ల త్రినాద్, గిరిజా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగన్ దోపిడీపై విచారణ చేపట్టాలి

- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

అరసవల్లి: మాజీ సీఎం జగన్‌రెడ్డి దోపిడీపై తక్షణమే విచారణ చేపట్టాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్‌రెడ్డి అండర్ వరల్డ్ డాన్ కంటే ప్రమాదకారి అని అన్నారు. అక్రమ ప్యాలెస్‌ల నిర్మాణం ప్రజలకు ముందుగానే తెలిసి ఉంటే 11 సీట్లు కూడా దక్కేవి కావన్నారు. ప్రజలు జగన్ పాలనను తిరస్కరించినా సరే ఓటమిని అంగీకరించలేని మనస్తత్వం జగన్‌రెడ్డిదని విమర్శించారు. వైసీపీ నేతలు జగన్‌రెడ్డిని పార్టీ అధ్యక్ష స్థానం నుంచి తొలగించి వేరొకరిని నియమించుకోకపోతే ఇక పార్టీ తలుపులు మూసుకోవాల్సిందేనని తెలిపారు. స్పీకర్ ప్రమాణ స్వీకారోత్సవానికి కూడా హాజరుకాకుండా సభను అగౌరవపరిచాడని దుయ్యబట్టారు. ప్రజలను కేవలం ఒక్క సెంటు స్థలంలో ఇల్లు నిర్మించుకుని నివసించాలని ఆదేశించిన జగన్‌రెడ్డి బాత్‌రూమ్ మాత్రం కనీసం ఒక్క సెంటు తక్కువ కాకుండా నిర్మించారన్నారు. తప్పు చేసిన అధికారులపై కూడా శాఖాపరమైన విచారణ చేపట్టాలని కోరారు. మంత్రి సీదిరి వైసీపీ కార్యాలయాల గురించి మాట్లాడుతున్నాడు కానీ అభివృద్ధి కోసం మాట్లాడడం లేదని, కనీసం పది కిలోమీటర్ల రోడ్లు కూడా వేయలేని అసమర్ధ పాలన మాజీ మంత్రికి కనిపించడం లేదా అని నిలదీశారు.

కాలువలకు మరమ్మతు చేయాలి

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు

కలెక్టరేట్: జిల్లాలో సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కోరారు.కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో ఆయకట్టుకు నీరందడంలేదని, మదుములు, షట్టర్లు మరమ్మతులు చేయించాలని తెలిపారు. ఈమేరకు సోమవారం శ్రీకాకుళంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీ కోసం కార్యక్ర మంలో జేసీ నవీన్‌కు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు.కాలువలు మరమ్మతులు చేపట్టి శివారు భూములకు నీరందించాలని కోరారు. కళింగదళ్ రిజర్వాయర్ షట్టర్లు మరమ్మతు చేయాలని, టెక్కలి మండలంలోని దాలిచెరువు నీరు పంటపొలాల ముంపు సమస్యను పరిష్కరిం చాలని, జీడిపంటకు మద్దతు ధర ప్రకటించాలని, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, మరమ్మతులను ప్రభుత్వమే చేపట్టాలని, కౌలు రౌతులకు గ్రామసభలు నిర్వహించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు.



కలెక్టరేట్: జేసీ నవీన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నాయకులు

రోడ్డుకు ఇరువైపులా మొక్కలు తొలగించండి

కవిటి కవిటి-ఈదుపురం, కవిటి-రాజపురం, కవిటి-సోంపేట, కవిటి-సిలగాం, కవిటి-బొరివంక ప్రధాన రహదారులకు ఇరువైపులఉన్న పిచ్చిమొక్కలు తొలగించాలని జనసేన ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్‌కోరారు.ఈ మేరకు సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరెడ్డికు వినతిపత్రం అందజేశారు. బాగా చెట్లు పెరగడంవల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.

గారలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గార: గార మండలపరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎటువంటి ఫిర్యాదులు అందలేదని ఎంపీడీవో బి.కళ్యాణి తెలిపారు. కార్య క్రమంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాదరావు, ఏవో దుంపల పద్మావతి, ఏపీవో సీహెచ్ సంధ్యారాణి, ఎంఈవో నక్క రామకృష్ణ, ఏఈలు నక్క చక్రధర్‌రావు, ఎల్.పవన్ మూర్తి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ధన్ముఖీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగాలి

బూర్జ: విద్యార్థులు ఉత్తమ విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు ఎదగాలని మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాదరావు తెలిపారు. కొల్లివలస గురుకుల పాఠశాలలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆనెపు రామకృష్ణ, జనసేన నాయకులు విక్రమ్, ఆనంద్‌తో కలిసి విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ చేశారు.

కార్మికుల శ్రేయస్సుకు కృషి

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం: కార్మికుల శ్రేయస్సుకు అన్నివిధాలుగా కృషి చేస్తానని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైసీపీ ఐదేళ్లపాలనలో స్థానిక యూబీ పరిశ్రమ యాజమాన్యం, కార్మికులు తీవ్ర ఇబ్బదులు పడ్డారని పేర్కొన్నారు. యూబీ పరిశ్రమలో పనిచేసిన కొంతమంది వైసీపీమూక కార్మికనాయకులు కావడంతో యాజమాన్యాన్ని ఇబ్బందిపెడుతూ కార్మికులకు, యాజమాన్యానికి సత్సంబంధాలు లేకుండాచేశారని తెలిపారు. రాక్షసపాలన పోయి ధర్మపాలన రావడంతో వైసీపీ మూక తట్టుకోలేక తనపై తప్పుడు ఆరోపణలకు దిగారని పేర్కొన్నారు. టీడీపీ పాలనలో యూబీ పరిశ్రమ ఏవిధంగా అభివృద్ధి చెందిందో, అదేవిధంగా కూటమి పాలనలో యూబీ పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల శ్రేయస్సుకు అన్నివిధాలుగా కృషి చేస్తానని తెలిపారు. యాజమాన్యం,కార్మికుల మధ్య మంచి సత్సంబంధాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు ప్రతి కార్మికుడు ఎంతో కృషి చేశారని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తన పై బురద జల్లే కార్యక్రమాలకు పాల్పడుతున్నాడని, ఇటువంటి తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని పేర్కొన్నారు.

బీమామిత్రలుగా అవకాశం కల్పించండి

ఇచ్ఛాపురం: తమకు అవకాశం కల్పించిఆదుకోవాలని బీమామిత్రలు కోరారు. ఈమేరకు సోమవారం ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. బీమామిత్రలుగా తిరిగి అవకాశం కల్పించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వం ఎటువంటిసమాచారం ఇవ్వకుండా 1800 మంది బీమామిత్రలను తొలగించందని తెలిపారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. అలాగే ఇచ్ఛాపురం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుకు కూడా బీమా మిత్రలు సునీత, గీత, కుమారి, కుసుమ వినతిప త్రం అందజేశారు.

రుణాలు సకాలంలో చెల్లించండి: ఏపీఎం

ఇచ్ఛాపురం: మహిళా సంఘాల గ్రూపులు బ్యాంకులు నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఏపీఎం సనపల ప్రసాద్ తెలిపారు. సోమవారం లొద్దపుట్టిలో స్వయం శక్తి సంఘాలతో వార్షిక మహా సభ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘాలకట్టుబాట్లు, విధి నిర్వహణపై అవగాహన కల్పించారు.

పూర్వవిద్యార్థుల ఆర్థికసాయం

సోంపేట: బారువ ఏటివీధికి చెందిన దున్న గంగరాజు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేశారు.గంగరాజు కుమార్తె చాట్ల బజారువద్ద చెట్టుకొమ్మ విరిగి కాళ్లకు గుచ్చుకుంది. దీంతోప్లాస్టిక్ సర్జరీకోసం ఆయనతో 1997లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ 20వేలు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రాజేష్ చౌదరి, లొట్ల నాగరాజు, సూరి తులసి, గుర్రాల శివశంకర్, దుమ్ము హేమరాజు తదితరుల పాల్గొన్నారు.

ఎంపీ కలిశెట్టికి సన్మానం

లావేరు: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకి సోమవారం ఢిల్లీ తెలుగుఅకాడమీలో ఎన్‌డీఏ కూటమి నాయకులు సన్మానించారు. కార్య క్రమంలో ఎన్‌డీఏ నాయకులు కోరాడ వెంకటరావు, పిన్నింటి భానోజీనాయుడు, బాల బొమ్మ వెంకటేశ్వరరావు, ఐ చలపతిరావు, త్రిమూర్తిల రాజులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయాలు స్వాధీనం చేసుకోవాలి

పొందూరు: అనుమతులు లేకుండా వైసీపీ నిర్మిస్తున్న ప్యాలెస్‌ల వంటి కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలని బీజేపీ రాష్ట్ర సమాచారహక్కుచట్టం విభాగం కోకన్వీనర్ కిల్లి శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో కోరారు. వందలకోట్ల రూపాయలు విలువచేసే ప్రభుత్వ భూములను అక్రమంగా తీసుకుని దోచుకున్న ప్రజాధనంతో కడుతున్న భవనాలను కల్చివేయకుండా స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. వాటిని ప్రభుత్వకార్యాలయాలుగా మార్చి అవసరాలకు వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందరేశ్వరికి లేఖలు రాశానని తెలిపారు.

టీటీడీ ఈవోను కలిసిన పురుషోత్తంనాయుడు

అరసవల్లి: తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో శ్యామలరావును ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమవారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన శ్యామలరావుకు శుభాకాంక్షలు తెలియజేశారు.



శ్యామలరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న పురుషోత్తంనాయుడు

జాతీయ ఆర్చరీ పోటీలకు తేజేశ్వరరావు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లకు చెందిన విద్యార్థి నల్లి తేజేశ్వరరావు విలువిద్య (ఆర్చరీ)లో సత్తాచాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఎచ్చెర్లలో నివాసముంటున్న ఆర్మీ విశ్రాంత ఉద్యోగి మల్లేశ్వరరావు, అధ్యాపకురాలు వసంత లక్ష్మీ దంపతుల కుమారుడు తేజేశ్వరరావు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ స్థానాన్ని సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విశాఖపట్నం పరవాడలో ఎనిమిదో తరగతి చదువుతున్న తేజేశ్వరరావు చిన్నప్పటి నుంచి విలువిద్య పట్ల ఆసక్తి చూపుతున్నాడు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలు, ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్ -13 విభాగంలో పాల్గొని ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తేజేశ్వరరావును పలువురు అభినందిస్తున్నారు.



తేజేశ్వరరావు

దొంగతనం కేసులో వ్యక్తికి ఆరునెలల జైలు

నరసన్నపేట: దొంగతనానికి పాల్పడిన కేసులో యారబాడు గ్రామానికి చెందిన బమ్మిడి దేవకుమార్‌కు 6 నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సివిల్ కోర్టు న్యాయాధికారి సి.హరిప్రియ సోమవారం తీర్పు చెప్పారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. స్థానిక శ్రీరామ్ నగర్-4లో పల్లి బాలకృష్ణ ఇంటిలో 2019 నవంబర్ 6వ తేదీన దేవకుమార్ దొంగతనం చేశాడు. ఆ మరుసటి రోజు బాలకృష్ణ పోలీసులకు ఐదున్నర తులాలు బంగారు ఆభరణాలు, మూడు సెల్‌ఫోన్లు, పోయినట్లు ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా దేవకుమార్ నిందితుడిగా నిర్ధారణ కావడంతో న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ అశోక్‌బాబు తెలిపారు. ఈ కేసులో ఏపీపీగా రొక్కం సంతోషి శాంతి కుమారి వ్యవహరించారు.

దుర్గగుడిలో హుండీ దొంగతనం

పొందూరు: మండలంలోని తండ్యాంపంచాయతీ తండ్యాంమెట్ట (ఎస్ఆర్ఎన్) కాలనీ దుర్గగుడిలో ఆదివారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు గుడిలోఉన్న హుండీని తీసుకువెళ్లి దానిలో నగదును దొంగిలించారు. హుండీలో సుమారు రూ.30 వేలు వరకు ఉంటుందని ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. హుండీలో నగదును దోచుకెళ్లిన దొంగలు హుండీని సమీపంలో ఉన్న పొలాల్లో విడిచిపెట్టారు. కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు దుర్గగుడిని పరిశీలించి కేసు నమోదుచేశారు.

‘మీకోసం’ అర్జీలకు న్యాయం చేస్తాం: ఎస్పీ

శ్రీకాకుళంక్రైం: ప్రజాఫిర్యాదుల నమోదు,పరిష్కార వేదిక(మీకోసం) కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలపై చట్టప్రకారం విచారణ జరిపి న్యాయం చేస్తామని బాధితులకు ఎస్పీ జీఆర్ రాధిక భరోసాఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మీకోసం కార్యక్రమంలో 34 అర్జీలు రాగా, వాటిలో కుటుంబ తగాదాలకు సంబంధించి ఆరు, మోసపూరితమైనవి రెండు, ఒక ఆస్తి తగాదా, మూడు మిస్సింగ్ కేసులు, 12, సివిల్ తగాదాలు, ఇతర తగాదాలపై మరో పది ఫిర్యాదులు వచ్చాయి.ఫిర్యాదులను సంబందిత అధికారులకు పరిష్కరించాలని ఎస్పీ ఫోన్‌లో ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జి.ప్రేమ్‌కాజల్ పాల్గొన్నారు.

12 వరకు బడిబయట పిల్లల గుర్తింపు



కొత్తకోటలో అవగాహన ర్యాలీ చేస్తున్న విద్యాశాఖాధికారులు

సరుబుజ్జిలి: సర్వశిక్ష అభియాన్ ఆదేశాల మేరకు జూలై 12వ తేదీ వరకూ బడి బయట పిల్లలను గుర్తించనున్నట్లు ఎంఈవోలు కె.శ్రీనివాసరావు, డి.బాలరాజు తెలిపారు.సోమవారం మండలంలోని కొత్తకోటలో విద్యాశాఖ ఆధ్వర్యంలో మేము బడికి పోదాం కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కొత్తకోట హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సీఆర్ఎంటీలు చిన్నారావు, చిరంజీవి, రోహిణి, రామినాయుడు పాల్గొన్నారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించాలి

అరసవల్లి: సైన్స్ సంబంధిత విషయాల పట్ల విద్యార్థుల్లో ఆసక్తి పెంపొందేలా సమర్థవంతంగా కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వేంకటేశ్వరరావు, ఉప విద్యాధికారి విజయకుమారి కోరారు. ఇటీవల కొత్తగా ఎన్నికైన బయోలాజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం కార్యవర్గ సభ్యులు పుట్టా ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, గౌరవాధ్యక్షుడు కవిటి కుమార్, రాష్ట్ర సభ్యుడు గొంటి గిరిధర్, జి.మోషే వార్ని కలిశారు.



డీఈవోను కలిసిన ఫోరం సభ్యులు

వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలి

- వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రినాథ



నాదెండ్ల మనోహర్‌కు సమస్యలను వివరిస్తున్న వీఆర్ఏలు

పొందూరు: పేస్కేల్ అమలుచేయాలని, అర్హత ఉన్న వీఆర్ఏలను వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు టి.త్రినాథ కోరారు. ఈ మేరకు ఏళ్లతరబడి అపరిష్కృతంగా ఉన్న వీఆర్ఏల సమస్యల పరిష్కరించి న్యాయం చేయాలని రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్‌ను కోరారు. ఈ మేరకు అమరావతిలో సోమవారం వీఆర్ఏ సంఘసభ్యులతో కలిసి మంత్రులను కలిసి సమస్యలను వివరించారు. అనంతరం సంఘప్రతినిధులు షేక్‌బందగీసాహెబ్, కె.రవికుమార్, జి.వెంకటన్న తదితరులతో కలిసి మంత్రులకు సమస్యలపై వినతిపత్రం అందజేశారు.

టీటీడీకి చేపేనపేట బెల్లం

ఆమదాలవలస: మండలంలోని చేపేనపేట, నిమ్మతొర్లువాడల్లో ప్రకృతి వ్యవసాయం పద్ధతుల్లో సాగుచేస్తున్న చెరకు నుంచి తయారు చేసిన బెల్లాన్ని ప్రకృతి వ్యవసాయవిభాగం డీపీఎం రేవతి సమక్షంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి(టీటీడీ) పంపించారు. ఈసందర్భంగా రేవతి మాట్లాడుతూ చేపేపేట, నిమ్మతొర్లోడ నుంచి పది టన్నుల బెల్లాన్ని తిరుపతి దేవస్థానానికి పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెఫెడ్ సిబ్బంది, ఎన్ఎఫ్ఏ శ్రీనివాస్, మార్కెటింగ్ ఎన్ఎఫ్ఏ శివాజీ, మాస్టార్ ట్రైనర్ శోభన్, యూనిట్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, తిరుపతిరావు, లక్ష్మీకృష్ణవేణి, జానకిరామ్, గ్రామ సర్పంచ్‌లు సత్యరాజ్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

లీగల్ ఎయిడ్ అందించేందుకు చర్య తీసుకోవాలి

గుజరాతీపేట: హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్‌కు సంబంధించి జనవరి 2023 నుంచి డిసెంబర్ 2023 మధ్యలో జరిగిన యాక్సిడెంట్ కేసుల్లో క్షతగాత్రులకు సంబంధించి కేసుల వివరాలను పరిశీలించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యా సినాయుడు పేర్కొన్నారు.ఈమేరకు పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆయా కేసుల వివరాలను పరిశీలించి క్లెయిమ్ అండ్ లీగల్ ఎయిడ్ అందించే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హిట్ అండ్ రన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దుప్పలవలస గురుకుల ప్రిన్సిపాల్‌గా బుచ్చిరాజు

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్‌గా బోర బుచ్చిరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఉంగరాడ గురుకుల పాఠశాల/కళాశాలలో గ్రేడ్-2 ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న బుచ్చిరాజును గ్రేడ్-1 ప్రిన్సిపాల్‌గా పదోన్నతి కల్పిస్తూ దుప్పలవలసకు బదిలీ చేశారు. అలాగే ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న దువ్వాడ దేవేంద్రరావుకు గ్రేడ్-1గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు.

ఇచ్ఛాపురంలో దుకాణాలపై దాడులు



దుకాణంలో తనిఖీచేస్తున్న సిబ్బంది

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో దుకాణాలపై మునిసిపల్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. అవగాహన లేక..అమలుకు నోచుకోక శీర్షికతో ప్లాస్టిక్‌నిషేధం అటకెక్కడంపై కథనం ప్రచురితంకావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు మునిసిపల్ అధికారులు మార్కెట్, బస్టాండ్, కిరాణా షాపుల్లో విస్తృతంగా దాడులుచేశారు. కూరగాయలు, కిరాణా దుకాణాల్లో దొరికిన ప్లాస్టిక్ కవర్లు సీజ్‌చేసి అపరాధ రుసుము విధించారు. కార్యక్రమంలో మునిసిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ గోవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్లు మార్చడం వల్ల ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు గొల్లవీధి, పకీర్‌పేట, వీకేపేట, ఆసుపత్రిరోడ్, దానంపేట, రత్తకన్న, తోటూరు, మండపల్లిల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

గార: గారలో ఎమ్మెల్యే గొండు శంకర్ మంగళవారం తొలిసారిగా పర్యటించనున్నారు. ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద రైతులకు విత్తనా లు పంపిణీ చేస్తారని ఎంపీడీవో బి.కల్యాణి ఒక ప్రక టనలో తెలిపారు.

28న తలనీలాలకు వేలంపాట

అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో ఈనెల 28న మధ్యాహ్నం ఒంటి గంటకు ఐదోసారి తలనీలాలకు ఈ టెండర్ కమ్ బహిరంగవేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండుగంటలకు పోగుచేసిన తలనీలా ల కోసం వేలంపాట జరుగుతుందని పేర్కొన్నారు.

29న మిగులు సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష

ఎచ్చెర్ల: దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బోర బుచ్చిరాజు ఒక త్రెలిపారు. ప్రవేశ పరీక్ష ఆ రోజు ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య జరుగుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 26లోగా గురుకుల పాఠశాలకు దరఖాస్తు అందజేయాలని కోరారు.

- **గుజరాతీపేట:** స్థానిక పెద్దపాడులోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికిగాను ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు మిగులు సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ మార్పు జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.ఈనెల 29న ప్రవేశ పరీక్ష నిర్వహించి మిగులు సీట్లను కేటాయిస్తామని తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

బూర్జ: మండలంలోని అయ్యవారిపేట పంచాయతీ చోడవరపు సత్యనారాయణ ఇటీవల పిడుగుపాటు గురై మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు పరామర్శించారు.ఆయన వెంట ఆమదాలవలస నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షులు లఖినేని సాయిరాం, బూర్జ మండలం ఎస్సీ విభాగం అధ్యక్షుడు జి.అప్పారా వు, రాష్ట్ర ఎస్సీ విభాగం ప్రధాన కార్యదర్శి బొత్స వెంకటరమణ, దుర్గారావు తదితరులు ఉన్నారు. అలాగే చోడవరపుసత్యనారాయణ కుటుంబానికి జనసేన ఎంపీటీసీ విక్రమ్, జనసేన నాయకులు మామిడి సత్యనారాయణ, గేదెల వినోద్ పరామర్శించారు.

కంచిలిలో కేశవయ్యకు..

కంచిలి: కంచిలికి చెందిన టీడీపీ నాయకుడు మద్దిల కేశవయ్యకు ఎమ్మెల్యే బెందాళం అశోక్ సోమవారం పరామర్శించారు. ఇటీవల ఆయన ఆపరేషన్ చేసుకోవడంతో ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాదిన రామారావు, కురయ్య, తమరాల శోభన్ పాల్గొన్నారు.

పది ఫ్యాన్ల వితరణ

కంచిలి: మండలంలోని నువాగడ ఆశ్రమ పాఠశాలకు సోంపేట రోటరీ ఆధ్వర్యంలో పది ఫ్యాన్లు రోటరీ పీడీజీ విశ్వనాథ్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాడికి 100మంది విద్యార్థులకు కావలసిన పరుపులు, పది ఫ్యాన్లు అందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాస్, కార్యదర్శి పీవీ కృష్ణారావు, కోశాధికారి రవికుమార్, లక్ష్మీనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

జగన్నాథాలయానికి ఇన్వర్టర్

ఇచ్ఛాపురం: స్థానిక పెద్ద జగన్నాథాలయానికి రూ20 వేలు విలువ చేసే ఇన్వర్టర్, బ్యాటరీని బంగారు వ్యాపారవేత్త వెచ్చా కేశవరావు అందించారని అర్చక సిబ్బందితోపాటు సేవాదళ్ సభ్యులు కాళ్ల శ్రీనివాసరావు తెలిపారు.